


EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శనివారం
22-03-2025
పేజీలు: 02



## ఇప్పటికైనా జగన్ అది తెలుసుకుంటే మేలు: లోకేశ్

అమరావతి: ప్రభుత్వం శాశ్వతం.. రాజకీయాలు ఎన్నికలకే పరిమితమని ఇప్పటికైనా జగన్ (YS Jagan) తెలుసుకోవాలని మంత్రి నారా లోకేశ్ (Nara Lokesh) హితవు పలికారు. ప్రభుత్వం మారినా.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగించడం సంప్రదాయమన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని గతంలో జగన్ విధ్వంస పాలనతో బ్రేక్ చేశారని విమర్శించారు. "2019లో జగన్ అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ బకాయిలు చెల్లించనని మొండికేశారు. తెదేపా హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను నిలిపేశారు. మరికొన్ని ధ్వంసం చేశారు. ఇలాంటి నిరంకుశ మనస్తత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. మేం అధికారంలోకి రాగానే జగన్ పెట్టిన బకాయిలు చెల్లించాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేశాం. విద్యార్థులు, తల్లిదండ్రులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చేయడమే బాధ్యతగా తీసకున్నాం" అని లోకేశ్ తెలిపారు.



## నితిన్ నెక్స్ట్ మూవీపై క్రేజీ న్యూస్

హీరో నితిన్ నటించిన లేటెస్ట్ మూవీ 'రాబిన్‌హుడ్' ఈ నెల 28న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమా తర్వాత నితిన్ నటించిన 'తమ్ముడు' చిత్రం కూడా వేసవి కానుకగా రిలీజ్ కానుంది. ఇప్పటికే ఆ చిత్ర షూటింగ్ ముగిసింది. అయితే, ఇప్పుడు నితిన్ నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ సినీ వర్గాల్లో జోరుగా వినిపిస్తుంది. నితిన్ తన నెక్స్ట్ చిత్రంగా ఓ స్పోర్ట్స్ డ్రామాకు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఇష్క్ చిత్ర దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఈ సినిమాను డైరెక్ట్ చేయబోతున్నారట. ఇక ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందించబోతున్నారని తెలుస్తోంది.



### డీలిమిటేషన్‌పై సమరం..
# చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల సమావేశం

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై చర్చించేందుకు తమిళనాడులోని అధికారపక్షం డీఎంకే శనివారం దక్షిణాది రాష్ట్రాల అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో నిర్వహించిన ఈ సమావేశానికి ఏడు రాష్ట్రాల రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం హాజరైంది. ఈ సమావేశంలో డీలిమిటేషన్ ప్రభావంపై సుదీర్ఘ చర్చలు జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విధానాన్ని ఎండగట్టి, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశంలో కేటీఆర్ ప్రత్యేకంగా ప్రసంగించి డీలిమిటేషన్ వల్ల కలిగే నష్టాలను వివరించనున్నారు. చెన్నై సమావేశం ద్వారా ఒక నిర్ణయం తీసుకుని, భవిష్యత్తులో ఒక కూటమిగా నిలిచి ఈ అన్యాయాన్ని సమిష్టిగా ఎదుర్కోనున్నాయి. ఈ సమావేశం ద్వారా దక్షిణాది రాష్ట్రాల ఐక్యత మరింత బలపడుతుందని, భవిష్యత్ రాజకీయాల్లో ఇది ఒక కీలకమైన మలుపు కావొచ్చని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. చెన్నై సమావేశం ద్వారా ఈ అంశంపై మరింత స్పష్టత రానుందని, దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి కేంద్రాన్ని ఒత్తిడికి గురి చేస్తాయని బీఆర్ఎస్ పార్టీ విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నేతలు కేటీఆర్‌తోపాటు రాజ్యసభలో పార్టీ పక్ష నేత కేఆర్ సురేశ్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు హాజరుకానున్నారు. అంతేకాదు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ సీఎం పినరయి విజయన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా పలువురు నేతలు హాజరయ్యారు.



## సాగునీరు అందించాలని మంత్రికి వినతి

వారబందీని సడలించి సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోని అఖిల పక్ష రైతుసంఘం ఆధ్వర్యంలో వైరాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ. జిల్లాలో 80 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేసిన రైతులు కనీస మద్దతు ధర తీవ్రంగా నష్టపోయారని, ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుకు చొరవ చూపి, మిర్చి క్వింటాకు రూ. 25 వేల మద్దతు ధర ప్రకటించాలన్నారు.




## చైనా దురాక్రమణను భారత్ ఎన్నటికీ అంగీకరించబోదు
### కేంద్రం స్పష్టీకరణ

సరిహద్దుల్లో చైనా దుందుడుకు వ్యవహారశైలిపై భారత్ మరోసారి మండిపడింది. తమ భూభాగాన్ని చైనా ఆక్రమించడాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేసింది. సరిహద్దుల్లో చైనా దుందుడుకు వ్యవహారశైలిపై భారత్ మరోసారి మండిపడింది. తమ భూభాగాన్ని చైనా ఆక్రమించడాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేసింది. కాగా, సరిహద్దు వివాదం పరిష్కారానికి చర్చల దిశగా ప్రయత్నాలు జరుగుతుంటే.. చైనా మాత్రం కవ్వింపులకు పాల్పడుతోంది. లఢఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాల్లో కౌంటీలను ఏర్పాటు చేస్తోంది. ఈ విషయంపై ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చైనా కౌంటీల నిర్మాణంపై కేంద్రానికి సమాచారం ఉందా..? అంటూ అడిగారు. ఈ ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా మాధానమిచ్చారు.

### అమెరికా చట్టాలకు కట్టుబడి ఉండండి..
# విద్యార్థులకు భారత్ కీలక సూచన



రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఎలాంటి అనుమానాలు వచ్చినా దేశం నుంచి బహిష్కరిస్తున్నారు. హమాస్‌తో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో ఇటీవలే భారతీయ పరిశోధకుడు బాదర్ ఖాన్ సూరిపై అమెరికా బహిష్కరణ వేటు వేసిన విషయం తెలిసిందే. అంతకుముందు మరో విద్యార్థిని రంజిని శ్రీనివాసన్‌ను కూడా బహిష్కరించింది. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఈ మేరకు అమెరికాలోని భారతీయ విద్యార్థులకు కేంద్రం కీలక సూచనలు చేసింది. యూఎస్‌లోని భారతీయ విద్యార్థులు అక్కడ ప్రభుత్వ చట్టాలకు కట్టుబడి ఉండాలని సూచించింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అమెరికాలోని భారత ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించింది. ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాలు విద్యార్థులు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. వీసాలు, వలస విధానాలపై నిర్ణయాలు పూర్తిగా ఆయా దేశాల విచక్షణాధికారానికి సంబంధించినవిగా పేర్కొంది. వాటిని పాటించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని స్పష్టం చేసింది.




## సూర్య రెట్రో నుంచి 'కనిమా' సాంగ్ రిలీజ్

తమిళ నటుడు సూర్య దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు, కాంబోలో వస్తున్న తాజా చిత్రం రెట్రో. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. మలయాళ నటుడు జోజు జార్జ్, కరుణకరణ్, జయరామ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా మే 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు మేకర్స్. రెట్రో నుంచి 'కన్నమ్మ' సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సంతోష్ నారాయణన్ స్వరపరిచిన ఈ గీతంలో అదిరిపోయే స్టెప్పులతో సూర్య- పూజల జంట ఆడియన్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. గ్యాంగ్‌స్టర్ మారిన ప్రేమికుడిని అతడి ప్రేయాసి ఎలా బయటికి తీసుకువచ్చింది.





## సునీతా విలియమ్స్‌కు ఓవర్‌టైమ్ జీతం సొంత డబ్బుతో చెల్లిస్తా డొనాల్డ్ ట్రంప్

ఎనిమిది రోజుల మిషన్ కోసం అనివెళ్లి దాదాపు తొమ్మిది నెలల పాటూ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భూమిపైకి తిరిగొచ్చిన విషయం తెలిసిందే. బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సముద్ర జలాల్లో దిగారు. స్పేస్‌ఎక్స్ కంపెనీకి చెందిన క్రూ డ్రాగన్ క్యాప్సూల్ ద్వారా ఆస్ట్రోనాట్స్ భూమికి చేరారు. నిర్దేశిత సమయం కంటే సుదీర్ఘకాలం అంతరిక్షంలోనే ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో వీరికి అదనపు వేతనం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. వాళ్లకు ఓవర్‌టైమ్ జీతాన్ని తన సొంత డబ్బుతో చెల్లిస్తానని ప్రకటించారు. 'సునీతా విలియమ్స్, విల్మోర్‌కు ఎలాంటి అదనపు వేతనం ఉండదా..?' అని విలేకరులు ట్రంప్‌ను 'నేను చేయాల్సివస్తే.. నా జేబు నుంచి వారికి ఓవర్‌టైమ్ జీతం చెల్లిస్తా' అంటూ సమాధానం ఇచ్చారు.

### ఆ హీరోయిన్ చీర లాగి, బట్టలు చించి
## నరకం చూపించిన కృష్ణం రాజు



రెబల్ స్టార్‌గా కృష్ణంరాజు ఎంత పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 1966లో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన కృష్ణం రాజు. రెబల్ స్టార్‌గా కృష్ణంరాజు ఎంత పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 1966లో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన కృష్ణం రాజు తెలుగు ప్రేక్షకుల హృదయాలపై చెరగని ముద్ర వేసుకున్నారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా, కేంద్ర మంత్రిగా పలు బాధ్యతలను నిర్వర్తించారు. ఇక కృష్ణంరాజుకు ముగ్గురు కుమార్తెలే కావడంతో.. తన తమ్ముడి కుమారుడైన ప్రభాస్‌ను తన కొడుకుగా భావించి ఆయన పాన్ ఇండియా స్టార్‌గా ఎదగడంలో ఎంతో కృషి చేశారు కృష్ణంరాజు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో క్షత్రియ వంశంలో జన్మించిన కృష్ణంరాజుది సంపన్న కుటుంబం. ఆయన వ్యక్తిగతంగా చాలా మంచివారు. రాజుల కుటుంబం నుంచి రావడంతో ఆయన ప్రతి ఒక్కరిని చాలా బాగా చూసుకుంటారు. తనతో పని చేసిన ప్రతి ఒక్కరికి కూడా మంచి విందు వడ్డిస్తుంటారు. తన మాటలతో కాని, చేతలతో కాని ఎవరికి హాని చేయని మనస్తత్వం కృష్ణంరాజుది.

## డ్రిప్ ఇరిగేషన్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టింది



అసెంబ్లీ క్వశ్చన్ అవర్‌లో ఆయిల్ పామ్ సాగుపై చర్చ జరిగింది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానాలు చెప్పారు. ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఆయిల్ పామ్ సాగు వల్ల లాభాలు కూడా వస్తాయని తెలిపారు. దీంతో పాటు డ్రిప్ ఇరిగేషన్‌పై కూడా దృష్టి పెట్టామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు.



## బ్రహ్మోత్సవాల్లో పల్లకీ మోసిన ప్రముఖ నిర్మాత దిల్ రాజు

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన ఇందూరు తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజు శుక్రవారం జరిగిన ఉత్సవాల్లో ప్రముఖ నిర్మాత దిల్‌రాజు, ఆయన సోదరులు నరసింహారెడ్డి, విజయసింహారెడ్డి, నాయకులు పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేష వాహనంపై స్వామిని ఊరేగించారు. ఆచార్య గంగోత్రి రామానుజదాసు స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. శేష వాహనం వల్ల నాగ దోషాలు తొలిగిపోతాయని స్వామి అన్నారు. యజ్ఞాచార్యులు ఆచార్య శిఖామణి స్వామి, శ్రీకర్ కుమారాచార్యులు, స్వామి రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామిల ఆధ్వర్యంలో పూజాదికార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, నరేందర్, రాజేశ్వర్, రమేష్, సాయిలు, భాస్కర్, మురళి, చిన్నయ్య, గంగారెడ్డి, నరేష్, సురేష్, రవి, పాల్గొన్నారు.



## అఖిపక్ష భేటీని వ్యతిరేకిస్తూ బీజేపీ ఆందోళన

డీలిమిటేషన్ను వ్యతిరేకిస్తూ తమిళనాడు వేదికగా నిర్వహిస్తున్న అఖిలపక్ష సమావేశాన్ని నిరసిస్తూ బీజేపీ ఆందోళన చేపట్టింది. నల్లజెండాలు పట్టుకొని పార్టీ శ్రేణులతో కలిసి ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ అన్నామలై చెన్నైలో భారీ ర్యాలీ తీశారు. స్టాలిన్ ప్రభుత్వం పార్లమెంట్ పునర్విభజనపై అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. డీలిమిటేషన్ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. సరిహద్దు రాష్ట్రాలతో అనేక సమస్యలు ఉన్నప్పటికీ, వాటి పరిష్కారానికి స్టాలినో చొరవ చూపడంలేదన్నారు. మరోవైపు ఈ అఖిల పక్ష సమావేశానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పంజాబ్ ముఖ్యమంత్రి భగవత్ మాన్, బీఆర్ఎస్ తరుపున ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఒడిషా నుంచి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భక్తచరణ్ దాస్, బీజూ జనతదళ్ పార్టీ సీనియర్ నేత సంజయ్ కుమార్ దాస్ తోపాటు పలువురు హాజరకానున్నారు.

## పాక్ బోణీ



న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న పాకిస్థాన్ కీలక మ్యాచ్‌లో బోణీ కొట్టింది. ఆతిథ్య జట్టుతో ఆక్లాండ్‌లో జరిగిన మూడో టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 205 పరుగుల భారీ లక్ష్యాన్ని పాక్ 16 ఓవర్లలోనే దంచేసి రికార్డు విజయాన్ని అందుకుంది. ఈ సిరీస్‌లోనే అరంగేట్రం చేసి తొలి రెండు మ్యాచ్‌లలో డకౌట్‌గా వెనుదిరిగిన ఓపెనర్ నవాజ్ (45 బంతుల్లో 105 నాటౌట్, 10 ఫోర్లు, 7 సిక్సర్లు) సెంచరీతో వీరవిహారం చేయగా కెప్టెన్ సల్మాన్ అలీ (51 నాటౌట్), హరిస్ (41) కివీస్ బౌలింగ్‌ను బెంబేలెత్తించి 9 వికెట్ల తేడాతో జయభేరి మోగించారు. తొలుత చాప్‌మన్ (44 బంతుల్లో 94, 11 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరవడంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించినా బౌలర్ల వైఫల్యంతో కివీస్‌కు పరాభవం తప్పలేదు.

## రాజస్థాన్ కెప్టెన్‌గా పరాగ్



ఐపీఎల్ కొత్త సీజన్‌లో ఆరంభ మ్యాచ్‌లను రాజస్థాన్ రాయల్స్ తమ రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ నేతృత్వంలో కాకుండా యువ ఆల్‌రౌండర్ రియాన్ పరాగ్ కెప్టెన్సీలో ఆడనుంది. తొలి మూడు మ్యాచ్‌లకు పరాగ్ సారథిగా వ్యవహరిస్తాడని గురువారం రాజస్థాన్ మేనేజ్‌మెంట్ ఓ ప్రకటనలో తెలిపింది. సంజూ జట్టుతో ఉన్నా ప్యూర్ బ్యాటర్‌గానే కొనసాగుతాడు.

# షణ్ముఖ మూవీ రివ్యూ

టాలీవుడ్ యువ నటుడు ఆది సాయికుమార్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. సాయికుమార్ తనయుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి తొలి సినిమా ప్రేమకావాలి అనే సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు. ఆ తర్వాత లవ్‌లీ, శశీ, సుకుమారుడు వంటి చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపును తెచ్చుకున్నాడు. ఇక ఆది చాలారోజుల తర్వాత ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'షణ్ముఖ'. ఈ సినిమాకు షణ్ముగం సాప్పని దర్శకత్వం వహించగా.. చిన్నారి పెళ్లికూతురు సీరియల్ ఫేమ్ అవికాగోర్ కథనాయికగా నటించింది. సాప్‌బ్రో ప్రొడక్షన్స్ పతాకంపై తులసి రామ్ సప్పని, షణ్ముగం సప్పని నిర్మించారు. డివోషనల్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ సందర్భంగా మూవీ రివ్యూ ఎలా ఉందో చూసుకుంటే.. ఒక మారుముల గ్రామంలో నిత్యం పూజలు చేసే ఉపాసకుడు విగాండ (చిరాగ్ జానీ) దంపతులకు ఆరు ముఖాలతో, కురూపంగా ఉన్న ఒక కుమారుడు జన్మిస్తాడు. ఆ బాలుడి వికృత ముఖాన్ని చూసిన ఊరిలోని ప్రజలందరూ అతడిని చూసి భయపడిపోతుంటారు. అయితే విగాండ్ తన కుమారుడికి "షణ్ముఖ" అని పేరు పెట్టి కొడుకు రూపాన్ని మార్చాలనే ఉద్దేశంతో కాశీకి వెళ్లి క్షుద్ర పూజలు నేర్చుకుంటాడు. ఆ తర్వాత తిరిగొచ్చిన అతను తన కుమారుడి సాధారణ రూపం




కోసం బామ్మర్ది సాయంతో తాంత్రిక పూజలు ప్రారంభిస్తాడు. మరోవైపు కార్తీ (ఆది సాయికుమార్) పోలీస్ ఆఫీసర్. డ్రగ్స్ మాఫియాను పట్టుకొనేందుకు వెళ్లిన సమయంలో జరిగిన దాడిలో తన పిస్టల్ కోల్పోతాడు. దీంతో తన తప్పును సరిదిద్దుకోవడానికి కమిషనర్ అతడికి వారం రోజుల గడువు ఇస్తాడు. మరోవైపు, బెంగళూరులో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న సారా మహేశ్ (అవికా గోర్) తన ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం ప్రాజెక్ట్ కోసం హైదరాబాద్‌కు వస్తుంది. తన మాజీ ప్రియుడు కార్తీని కలిసి అదృశ్యం అవుతున్న అమ్మాయిల ఆచూకీ కోసం తను రీసెర్చ్ చేస్తున్నట్లు ఈ విషయంలో సాయం కావాలని అడుగుతుంది. దీనికి ఒప్పుకున్న కార్తీ తప్పిపోయిన అమ్మాయిల జాడ గురించి వెతకడం మొదలుపెడతాడు. అయితే క్షుద్ర పూజలు నేర్చుకుని వచ్చిన విగాండ తన కుమారుడు అందంగా మారడం కోసం ఎటువంటి నేరపూరిత చర్యలకు పాల్పడ్డాడు? అమ్మాయిల అదృశ్యాల వెనుక విగాండ్‌కు ఏదైనా సంబంధం ఉందా? కార్తీ, సారా మధ్య గతంలో ఎందుకు విడిపోయారు? కార్తీ తన కోల్పోయిన తుపాకీని తిరిగి పొందగలిగాడా? అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. క్షుద్ర పూజలు బ్యాక్‌డ్రాప్‌లో ఇంతకుముందు అరుంధతి వంటి చాలా సినిమాలు వచ్చి ప్రేక్షకులను అలరించాయి. అయితే తాజాగా ఇలాంటి కథతోనే మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు షణ్ముగం. మూవీ స్టార్ అవ్వగానే ఆరు తలల ముఖంతో పుట్టిన పిల్లాడు అనగానే ప్రేక్షకులలో ఆసక్తి మొదలైంది. ఆ తర్వాత తన కొడుకును సాధారణ మనిషిగా మర్చాడానికి విగండా ఏం చేశాడు అనేది ఆసక్తిగా చూపించాడు దర్శకుడు. అయితే సడన్‌గా కథ హీరో వైపు తిరగడంతో సినిమా ట్రాక్ తప్పిందా అనే అనుమానం ప్రేక్షకులలో కలుగుతుంది. సాయి కుమార్, అవికగోర్‌లపై వచ్చే సన్నివేశాలు ప్రేక్షకుల ఊహకందేలా ఉంటాయి. దీంతో ఫస్ట్ ఆఫ్ కొంచెం నెమ్మదిగా సాగుతుంది. అయితే కార్తి, సారా కలుసుకున్న అనంతరం సినిమా ఎటువెళుతుంది అనేది ఆసక్తిగా ఉంటుంది.

సెకండాఫ్‌లో కార్తీ, సారా ఇన్‌వెస్ట్‌గేషన్ అంటూ తిరగడం. ఆ తర్వాత ట్విస్ట్‌లను ఒక్కోక్కటిగా రివీల్ చేయడం చేశాడు దర్శకుడు. ఇందులో క్షుద్ర పూజలు చేసే మాంత్రికులు పూజల విషయంలో దర్శకుడు మరింత పరిశోధన చేసి తెరకెక్కిస్తే సినిమా మరో లెవల్లో ఉండేది. తెరపై హీరో, హీరోయిన్ మధ్య రొమాంటిక్ సీన్స్ ప్రేక్షకులకు కాస్తంత రిలీఫ్ ఇస్తుంది.

కానీ సినిమాలో అది అవసరం లేకున్నా.. కావాలని ఇరికించినట్టు తెలుస్తుంది. ఓవరాల్‌గా హర్రర్, క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే వాళ్లకు ఈ సినిమా నచ్చుతుంది.




## ట్రంప్ మరో సంచలన ప్రకటన.. 5 లక్షల మంది వలసదారుల తాత్కాలిక హోదా రద్దు

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారత్ సహా పలు దేశాలకు చెందిన వారిని స్వదేశాలకు తరిమేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ట్రంప్ యంత్రాంగం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. తాత్కాలిక వలసదారులపై కఠిన చర్యలు చేపట్టింది. అమెరికా వ్యాప్తంగా 5 లక్షల మందికిపైగా వలసదారులకు తాత్కాలిక నివాస హోదాను రద్దు చేసింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ సంచలన ప్రకటన చేసింది. క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజువెలా దేశాలకు చెందిన 5,32,000 మంది వలసదారులకు చట్టపరమైన రక్షణను రద్దు చేస్తున్నట్లు హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్లు తెలిపింది. 2022 అక్టోబరు తర్వాత ఆ నాలుగు దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చినవారికి ఈ బహిష్కరణకు గురవుతున్నారు.

## లండన్‌లోని హీత్రూ విమానాశ్రయంలో విమాన సేవలు పునరుద్ధరణ

లండన్ హీత్రో విమానాశ్రయంలో విమానయాన సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. భారీ అగ్ని ప్రమాదం కారణంగా ఇక్కడ విమానాశ్రయాన్ని అధికారులు మూసివేసిన విషయం తెలిసిందే. చివరికి పరిస్థితులు మెరుగు పడటంతో.. 18 గంటల అనంతరం హీత్రో ఎయిర్‌పోర్ట్‌లో విమానాయాన సేవలను అధికారులు పునరుద్ధరించారు. లండన్‌లోని హీత్రూ విమానాశ్రయం సమీపంలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ఈ అంతర్జాతీయ ట్రావెల్ హబ్ నుంచి రాకపోకలు సాగించే 2.90 లక్షల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 1,350 విమానాలను రద్దు చేశారు.కొన్ని విమానాలను అవి ఎక్కడి నుంచి వచ్చాయో అక్కడికే తిప్పి పంపారు. అగ్ని ప్రమాదానికి కారణం తెలియరాలేదు. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని పోలీసులు వెల్లడించారు.



## సైబర్ నేరగాళ్ల నయా ప్లాన్ బట్టబయలు

మీ ఇంట్లో పనికిరాని పాత మొబైల్‌ను ఇస్తే ప్లాస్టిక్ వస్తువులు ఇస్తామని మీ ఊళ్లో తిరుగుతున్నారా? ప్లాస్టిక్ వస్తువులకు ఆశపడితే ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది.ఇలాగే ఆటోలో వీధి వీధి తిరుగుతూ పాత మొబైల్స్‌ను సేకరించి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రట్టయ్యింది. ఆరుగురు నిందితులతో కూడిన బిహార్ ముఠాను ఆదిలాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియాకు తెలిపారు.పాత, పనికిరాని మొబైల్స్‌ను ఇస్తే ప్లాస్టిక్ వస్తువులను ఇస్తామని బిహార్‌కు చెందిన ముఠా సభ్యులు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతారు.ఊరూరు తిరిగి పాత ఫోన్లను సేకరిస్తారు. అనంతరం ఫేక్ ఐడీ కార్డులతో తీసుకున్న సిమ్ కార్డులను అందులో వేసి, వాటితో సైబర్ నేరాలకు పాల్పడుతుంటారు. ఆ ఫోన్ నంబర్లతో అమాయక ప్రజలకు ఫోన్ చేసి, బ్యాంకు అధికారులమని నమ్మించి డబ్బులు కాజేస్తుంటారు. ఈ ముఠా గురించి తెలుసుకున్న ఆదిలాబాద్ పోలీసులు వారిని అదుపులోకి తీసకున్నారు. ఆరుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి, వారి దగ్గర నుంచి 2015 పాత మొబైల్స్, 105 సిమ్ కార్డులు, 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని సభ్యులు ఇప్పటికే రాష్ట్రంలోని 12 వేల మొబైల్స్‌ను సేకరించి, వివిధ సైబర్ నేరాలకు పాల్పడినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

